క్లుప్తంగా

ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి

రాజోళి: దీపావళి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని శాంతిగనర్ సర్కిల్ సీఐ టాటాబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్న పిల్లల విషయంతో తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

నిందితుడిని ఉరితీయాలి



అయిజ: నిజామాబాద్ జిల్లా పోలీస్‌ను నడిరోడ్డుపై హత్య చేసిన నిందితులను తక్షణమే ఉరితీయాలని ఏబీవీపీ నగర సంయుక్త కార్యదర్శి నరేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏబీవీపీ అయిజ శాఖ నాయకులు నిందితుడు రియాజ్ అరబ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు నిఖిల్, రోహిత్, శ్రీహరి, వెంకటేష్, తరుణ్, సంతోష్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

23 వరకు దరఖాస్తు గడువు

శాంతినగర్: ఓపెన్ టెన్త్, ఇంటర్ చదవాలనుకునే విద్యార్థులు ఈ నెల 23 లోపు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పరీక్ష కోఆర్డినేటర్ మద్దిలేటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో జరుగుతుందన్నారు. టాస్ ద్వారా ఇచ్చే సర్టిఫికెట్లు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, ఉన్నత విద్యకు సమానంగా ఉపయోగపడతాయన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 98859 94554 సంప్రదించాలని పేర్కొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

వీపనగండ్ల: యువత క్రీడల్లో రాణించినప్పుడే గ్రామానికి పేరు ప్రతిష్టలు వస్తాయని వివిధ పార్టీల నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వీపీఎల్–పై క్రికెట్ పోటీలను ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. క్రీడాస్ఫూర్తితో ఆడి గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. అదే విధంగా తూముకుంట గ్రామంలో ఉమ్మడి మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఎస్ఐ రాణి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీరయ్యయాదవ్, ముంత మల్లయ్యయాదవ్, రవీందర్‌రెడ్డి, గోపి, యాదయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





వర్షం నీటిలో నిలిచిన రాజోళికి వెళ్లే ఆర్టీసీ బస్సు



గత వారంలో రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

గుంతల రోడ్లు.. తప్పని తిప్పలు

- ప్రధాన రోడ్ల పరిస్థితి అధ్వానం
- లింక్ రోడ్లపై నిత్యం ప్రమాదాలే
- ప్రమాదాల బారిన ప్రజలు

రాజోళి: నిత్యం వేలాది వాహనాలు తిరిగే ప్రధాన రహదారులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. గుంతలమయమైన రోడ్లలో ప్రమాదాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. మండంలోని ప్రధాన రోడ్లు అధ్వానంగా మారడంతో రోడ్లపై ప్రయాణించాలంటేనే నరకయాతన అనుభవించాల్సి వస్తోందని వాపోతున్నారు. దీనికి తోడు లింక్ రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా ప్రధాన రహదారి

మండల కేంద్రం రాజోళి– శాంతిగనర్ రోడ్డు కేవలం ఈ రెండు మండలాలే కాదు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రాంతాలను కలుపుతూ నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ ఈ రోడ్డుపై ప్రయాణం మూడు కిలోమీటర్ల దూరానికి 40 నిముషాలు పడుతుంటే రోడ్డు ఎంత దారుణంగా ఉందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

నిత్యం ప్రమాదాలే

కర్నూలు జిల్లా పులకుర్తికి చెందిన ఇద్దరు, గూడూరుకు చెందిన ఓ వ్యక్తి, కొంతలపాడుకు చెందిన రెండు బైక్‌లు, కర్నూలు పట్టణానికి చెందిన నలుగురు వ్యక్తులు వాహనం అదుపుతప్పి గాయాల పాలయ్యారు. ఇలా నిత్యం రాజోళి ప్రధాన రహదారిపై ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజా సంఘాల నాయకులు, రాజోళి గ్రామస్తులు గత వారంలో పెద్దఎత్తున రాస్తారోకో నిర్వహించగా.. తహసీల్దార్ రామ్మోహన్ తాత్కాలిక మరమ్మతు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ నేటి వరకు గుంతలపై గంప మట్టిపోయలేని దుస్థితి.



రాజోళి-వడ్డేపల్లి రోడ్డుపై ఇరుక్కున్న పత్తి లోడు వాహనం

ఆర్డీఎస్ రోడ్లు కూడా..

మండలంలో ఆర్డీఎస్ అనుసంధాన రోడ్లపై కూడా పరిస్థితి అధ్వానంగా మారింది. ఇటీవల రాజోళికి చెందిన షాలు అనే వ్యక్తి అశోక్‌నగర్ క్యాంప్ వద్ద ట్రాక్టర్ బోల్తా పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తుంగభద్ర నదిపై ఉన్న కరకట్టపై గుంతలు పడటంతో ఈశ్వరయ్య అనే ఉపాధ్యాయుడు కర్నూలు నుంచి రాజోళికి వస్తూ చీకట్లో గుంతల కారణంగా బైక్ అదుపు తప్పి నదిలో పడబోయాడు. అసలే సరిహద్దులో ఉన్నామని, జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే గుంతల రోడ్లపై నానా అవస్థలు పడుతున్నామని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతల రోడ్లకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

తాత్కాలిక మరమ్మతు చేపడతాం

రాజోళి– శాంతిగనర్ ప్రధాన రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారిందని ఫిర్యాదులు వస్తున్నాయి. మైనింగ్ అధికారులతో మాట్లాడి మట్టితో గుంతలను పూడ్చి మరమ్మతు చేపడతాం. శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతాం.

రామ్మోహన్, తహసీల్దార్ రాజోళి

ప్రాణాలు పోతున్నాయి



సరైన రోడ్లు లేక, అరకొరగా ఉన్న అసంతృప్త రోడ్లపై పర్యవేక్షణ లేక వాహనదారుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇటీవల అశోక్‌నగర్ నుంచి రాజోళికి వచ్చే కెనాల్ రోడ్డుపై రాజోళి వ్యక్తి చనిపోయాడు. గుంతల రోడ్లపై కనీసం మరమ్మతు కూడా చేపట్టడం లేదు.

– అడివయ్య, రాజోళి

వ్యాపారాలు కూడా మానేశాం



రాజోళితో పాటుగా వడ్డేపల్లి, అయిజ తదిదర మండలాల్లోని గ్రామాలకు వెళ్లి వ్యాపారం చేస్తుంటాం. ఉదయం నుంచి రాత్రి వరకు ఇవే గ్రామాల్లో తిరిగి వ్యాపారం చేసుకునే వాళ్లం. ప్రస్తుతం రోడ్ల పరిస్థితి కారణంగా ఇక్కడకు రాలేకపోతున్నాం.

– జగదీష్, చిరువ్యాపారి, రాజోళి

ఊరికి సేవ చేయడానికే సేవా సమితి



అల్పాహారం అందజేస్తున్న సేవాసమితి సభ్యులు

శాంతినగర్: ఊరి ప్రజలకు సేవ చేయడానికే శాంతినగర్ సేవా సమితి పనిచేస్తుందని సమితి సభ్యులు అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో ఆదివారం సేవా సమితి కార్యకలాపాలు మొదలుపెట్టి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అభాగ్యులకు అల్పాహారం అందజేశారు. మెయిన్ రోడ్డులోని దుకాణ దారులకు ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించి బట్ట సంచులు పంపిణీ చేశారు. సమితి సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఊరికి కొంతైనా ఉపకారం చేయాలని, ఎవరికి చేతనైనంత వారు చేస్తే ప్రతి గ్రామం, పట్టణం అభివృద్ధి చెందుతుందననారు. కార్యక్రమంలో సభ్యులు షేక్ అస్లాం షరీఫ్, నాగరాజు, ఆటో ఖలీల్, మురళి, డిష్ గౌస్, హరి, మాలిక్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నివారణకు టీకాల పంపిణీ



పైపాడులో గేదెకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

శాంతినగర్: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి స్వరూపరాణి అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని పైపాడులో పశువులకు ఆదివారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ.. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా టీకాలు వేస్తున్నామని, పశువుల యజమానులు జీవాలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పేర్కొన్నారు. 165 ఆవులు, ఎద్దులు, 222 గేదెలకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఎల్ఓ వరప్రసాద్, ఎల్ఎస్ఏ లతీఫ్, ఓఎస్ వెంకటమ్మ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులాలకు కొమురంభీం పేరు పెట్టాలి



మాట్లాడుతున్న హిందూ వాహిని నాయకులు

గద్వాలటౌన్: రాష్ట్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలకు కొమురంభీం పేరు పెట్టాలని హిందూ వాహిని ఉమ్మడి పాలమూరు విభాగ్ అభిలాష్ హౌదేకార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక హిందూ వాహిని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజాకార్ల నుంచి తెలంగాణ విముక్తి కోసం జరిగిన పోరాటంలో కొమరంభీం కీలక పాత్ర పోషించిన విషయాన్ని గుర్తు చేశారు. గురుకులాలకు ఆయన పేరు పెట్టడం వాని త్యాగాలను స్మరించుకోవడానికి దోహదం చేస్తుందన్నారు. అదే విధంగా చరిత్రను పాఠ్యంశాల్లో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయాదవ్, రామకృష్ణ, భాస్కర్, అనూష్‌రెడ్డి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భాగవత సప్తాహ మహోత్సవం



భాగవత పారాయణం చేస్తున్న అర్చకులు

ఇటిక్యాల: మండల పరిధిలోని కొత్తదేవరపల్లి పాండురంగస్వామి ఆలయంలో ఆలయ కమిటీ, విశ్వ హిందూ పరిషత్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఏడు రోజులుగా నిర్వహిస్తున్న భాగవత సప్తాహ కార్యక్రమం ఆదివారం దిగ్విజయంగా ముగిసింది. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ఆలయాలకు చెందిన ప్రధాన అర్చకులు భగవద్గీతపై అవగాహన కల్పించారు. ప్రతి మనిషికి ఆనందం ముఖ్యమని లౌకిక ఆనందం తాత్కాలికం మాత్రమేనని, నిజమైన ఆనందం భాగవత ప్రవచనం ఆలకించడం ద్వారానే అనుభవం పొందగలరని అన్నారు. ఊరేగింపు కార్యక్రమం కనులపండువగా సాగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంకురార్పణ పూజలు



అంకురార్పణ చేస్తున్న పండితులు

కేటీదొడ్డి: మండల పరిధిలోని పాగుంట శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి అంకురార్పణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణం, యాగశాల ప్రవేశం అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మకర తోరణం బహూకరణ

మండల కేంద్రానికి చెందిన టీచర్ గోవిందు కుటుంబ సభ్యులు ఉత్సవ మకర తోరణాన్ని స్వామికి బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ పెద్దలు దాత కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, రవిబాబు, వెంకటేష్, ఆనంద్, ద్వారకానందన్, కుశంక్, చాణిక్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఎస్ కాల్వకు లీకేజీ



మానవపాడు: మండలంలోని నారాయణపురం గ్రామంలో ఆదివారం ఆర్డీఎస్ డీ– 30 కాల్వ లీకేజీ కారణంగా రోడ్లపై నీరు ప్రవహిస్తుంది. దీంతో సాగునీరు వృథాగా పోతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఏళ్ల తరబడి ఇదే సమస్య ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి లీకేజీ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాలపై అవగాహన

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రబోధా సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ.. భగవద్గీత అన్ని వేళలా మార్గదర్శనీయమని పేర్కొన్నారు.

ఎస్సీ హాస్టల్ ప్రహరీ నిర్మించాలి



మల్దకల్: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు కూలిన ప్రహరీని నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. గ్రామానికి దూరంగా ఉన్న వసతి గృహానికి ప్రహరీ పూర్తిస్థాయిలో లేకపోవడంతో పశువులు, మందుబాబులు సంచరిస్తున్నట్లు వాపోతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలిన ప్రహరీకి మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు మలుపు

మానవపాడు: మండల కేంద్రం నుంచి జాతీయ రహదారికి వెళ్లే ప్రధాన రహదారిపై జూరాల కాల్వపై కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉంది. కల్వర్టు చిన్నదిగా ఉండటం, రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టు వద్ద రక్షణ గోడ నిర్మించాలని అదే విధంగా ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పశువైద్య కేంద్రానికి మరమ్మతు చేపట్టాలి



మల్దకల్: మండలంలోని బిజ్వారం పశువైద్య కేంద్రానికి మరమ్మతు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. 20 ఏళ్ల క్రితం నిర్మించిన పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతోతో ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువైద్య కేంద్రానికి మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

హామీలు నెరవేర్చడంలో విఫలం

వనపర్తి విద్యావిభాగం: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో మూడేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనేని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని 20వ వార్డులో 50 మంది యువకులు యువ నాయకుడు సునీల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల్లో బీఆర్ఎస్‌పై అపూర్వ స్పందన లభిస్తుందన్నారు. బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో పట్టణాన్ని ప్రగతి పథంలో నడిపించామని, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రోడ్ల విస్తరణ పూర్తి చేశామన్నారు. నేడు రోడ్లు ఆక్రమించుకుంటున్న పట్టించుకున్న నాథుడు లేకుండా పోయాడన్నారు. మౌలిక వసతులు మంచినీటి, డ్రెయినేజీ, విద్యుత్, అంతర్గత రోడ్లు, పార్కులు, చెరువులు అభివృద్ధి చేశామని, వాటిని పరిరక్షించుకోలేని స్థితిలో నేటి పాలకులు ఉన్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వంలో జాగలేని, ఇల్లు లేని పేద వారు ఉండకుండా కృషి చేస్తామన్నారు. 3,200 డబుల్ బెడ్రూం ఇళ్లలో 15,00 పట్టణంలో నిర్మించామన్నారు. యువతకు స్వయం ఉపాధి, ప్రభుత్వ ప్రైవేట్ రంగాల్లో ఎదిగేందుకు ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభమెప్పుడో?



పాత బస్టాండ్‌లో నిలిచిన వర్షం నీరు(ఫైల్)

- రూ. 15 కోట్లు నిధులు మంజూరు
- ఇప్పటి వరకు విడుదల కాని వైనం
- అభివృద్ధికి నోచుకోని మున్సిపాలిటీ

అయిజ: మున్సిపాలిటీలోని ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రజల నుంచి వివిధ రకాల పన్ను వసూలు చేస్తూ ఉంటుంది. అనంతరం ఆ పన్నుల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టడం, రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించి, వీధిలైట్లు ఏర్పాటు చేసి తాగునీటిని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది కానీ అయిజ మున్సిపాలిటీలో మాత్రం రోడ్లకు ఇరువైపులా మురుగు నిల్వడం, గుంతలమయైమన రోడ్లతో అభివృద్ధికి ఆమడంత దూరంలో ఉంది.

మంజూరైన నిధులు

మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో సీసీరోడ్లు, నీటిసరఫరా, లైటింగ్, పార్కులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహక నిధుల పేరుతో సెప్టెంబర్ నెలలో ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేసింది. అదే విధంగా పట్టణంలో డ్రెయినేజీకిజీ నిర్మాణం చేపట్టేందుకు రూ. 5.20 కోట్లు మంజూరయ్యాయి.

మంజూరైన విడుదల కాని నిధులు

నెల రోజుల క్రితం నిధులు మంజూరైనా సరే ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదు. దీంతో అభివృద్ధి పనులు చేపట్టడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంతో అధ్వాన్న రోడ్లతో నానా అవస్థలు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మురుగునీటిలో పట్టణం

వర్షం పడిన కొన్ని గంటల పాటు పట్టణం మురుగులో మునిగి ఉంటుంది. ముఖ్యంగా కొత్త బస్టాండ్‌లోని అంబాభవాని ఆలయం పరిసర ప్రాంతంలో నూతనంగా నిర్మించిన హైలెవల్ బ్రిడ్జికి ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా మురుగు నిలుస్తుంది. పాత బస్టాండ్‌లో అయిజ– గద్వాల, తూంకుంట– ఎక్లాస్‌పురం రోడ్డు సంబంధించిన నాలుగు రోడ్ల కూడలి వర్షం పడిన ప్రతిసారి చెరువును తలపిస్తుంది. రాత్రి సమయంలో వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా ఉంటుంది. నీటిమడుగులో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి అనేక సార్లు ప్రజలు గాయాలపాలయ్యారు. పదేళ్ల క్రితం నిర్మించిన డ్రెయినేజీలు ప్రణాళిక బద్ధంగా లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలస్తుంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి పట్టణంలో నెలకొన్న సమస్యలు తీర్చాలని పుర ప్రజలు కోరుతున్నారు.



టీచర్స్ కాలనీలో లోపించిన పారిశుధ్యం

అభివృద్ధి జరగడం లేదు



మున్సిపాలిటీకి అభివృద్ధి పనులు ఏమాత్రం చేపట్టడం లేదు. వర్షాకాలం అనేక ప్రదేశాల్లో మురుగు నిలిచి ఉంటుంది. దీంతో అనారోగ్యాల బారిన పడుతున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

– శ్రీనువాసులు, అయిజ

డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టాలి



గతంలో నిర్మించిన డ్రెయినేజీలు పూర్తిగా శిథిలమయ్యా యి. దీంతో వర్షంనీరు ముందుకు కదలడం లేదు. పట్టణంలో కొన్ని ప్రదేశాల్లో ఇప్పటి వరకు డ్రెయినేజీలు నిర్మించ లేదు.

– వెంకటేష్, అయిజ

ప్రణాళిక పూర్తి కాలేదు



మున్సిపాలిటీకి మంజూరైన రూ. 15 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎస్టిమేషన్ వేసి కన్సల్‌టెన్సీ వారు డీపీఆర్ ఇవ్వాల్సి ఉంది. అనంతరం టెండర్లు నిర్వహించాలి. నిధులు విడుదలైన అనంతరం పనులు ప్రారంభిస్తాం.

– రాజశేఖర్, మున్సిపల్ ఏఈ